www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024

5

కాకినాడ

ఇంటి పన్ను రసీదులపై విచారణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాగులపల్లిలో ఇంటిని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

నాగులపల్లి గ్రామంలో దొంగ ఇంటి పన్ను రసీదులపై డిఎల్‌పిఒ టి.అన్నామణి విచారణ జరిపించారు. గడిచిన పంచాయితీ ఎన్నికల్లో నాటి కార్యదర్శి కూనిశెట్టి అచ్చమణి వ్యవహరించిన తీరుపై వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ చేపట్టారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలపై నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తానని డిఎల్‌పిఒ తెలిపారు. ఈ విచారణలో ఇఒపిఆర్‌డి సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇకపై స్మార్ట్‌గా దోపిడీ

విద్యుత్ వినియోగదారులపై కూటమి సర్కారు 'స్మార్ట్'గా మరో భారాన్ని మోపేందుకు వేగంగా పావులు కదుపుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బాంబును త్వరలో పేల్చనుంది. ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన కూటమి సర్కారు... అధికారంలోకి వచ్చిన తరువాత గత సర్కారు బాటలోనే పయనిస్తోంది. ఇందులో భాగంగా స్మార్ట్‌మీటర్ల నిర్వహణ కోసం ప్రయివేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో మంగళశారం పెద్ద ఎత్తున నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించింది.

- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సన్నద్ధం
- ఇకపై రీఛార్జ్ చేస్తేనే కరెంట్ సరఫరా
- సిబ్బంది నియామకానికి ప్రయివేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల నిర్వహణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు నడుం బిగించింది. విద్యుత్ సంస్థ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోందా..? అనే ప్రశ్నకు ఔననే సమాధానం వినిపిస్తోంది. తూర్పు విద్యుత్ సంస్థకు ఇప్పటికే అదానీ స్మార్ట్ మీటర్లు పెద్ద ఎత్తున చేరిన విషయం విధితమే. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేసినపుడు ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం గత సర్కారు తీసుకున్న విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మంగళవారం నగరంలోని గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగింది. తూర్పు విద్యుత్ సంస్థ పరిధిలోని నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అర్హత ప్రాతిపదిక మినహా పోస్టుల సంఖ్య ఏజెన్సీ వివరాలను సైతం కనీసం వెలుగులోకి రానీయకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

గేదెల నూకరాజు కళ్యాణమండపంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు

డిసెంబరు నుంచే స్మార్ట్ మీటర్ల బిగింపునకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 లక్షలకు పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. రోజువారీ విద్యుత్ వినియోగం 18 మిలియన్ యూనిట్లు నుంచి 20 మిలియన్‌ల యూనిట్ల వరకూ ఉంటుంది. ఈ సంఖ్యలో అత్యధిక మంది గృహ వినియోగదారుల కనెక్షన్లే ఉన్నాయి. తాజా నిర్ణయం నేపథ్యంలో ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ప్రతి నెలా విద్యుత్ వినియోగించిన అనంతరం మీటరు రీడింగ్ ఆధారంగా వినియోగదారులు బిల్లులు చెల్లించడం పరిపాటి. ఇకపై విద్యుత్ కావాలంటే ముందుగానే రీఛార్జ్ చేయించుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్‌లో బ్యాలన్స్ లేనిపక్షంలో సరఫరా నిలిచిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఇప్పటికే జిల్లాలో విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమలు చతికిల పడ్డాయి. ప్రభుత్వ సబ్సిడీలు కోసం ఎదురు చూస్తున్నాయి. మరోవైపు రైతులకు ఉచిత విద్యుత్ కొన్ని గంటలకే పరిమితమైంది. తాజా నిర్ణయంతో ఇకపై వినియోగదారులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారనుంది. ఓ వైపు విద్యుత్ కోతలు, మరోవైపు సర్‌ఛార్జీల బాదుడుతో సతమతమవుతున్న వినియోగదారులపై 'స్మార్ట్'గా మరో భారం మోపేందుకు కూటమి సర్కారు సమాయత్తమవుతోంది. గృహ వినియోగదారులతో పాటు పరిశ్రమలు, ఇతర రంగాలపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ఈ విధానంపై ఇప్పటికై పలు మార్లు వినియోగదారులు ఆందోళనలు చేసిన విషయం విధితమే. అయినప్పటికీ ప్రభుత్వం స్మార్ట్ దిశగా అడుగులు వేయడం విద్యుత్ వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా స్మార్ట్ మీటర్ల బిగింపు, రీఛార్జి, పర్యవేక్షణ తదితర పనులకు ప్రయివేటు ఏజెన్సీలు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీటి ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు వారి స్థాయి ఆధారంగా పోస్టులను బట్టి రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకూ నెలవారీ వేతనం చెల్లించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రంతా విద్యుత్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగుల పర్యవేక్షణలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే వీరి విధివిధానాలను ఇంకా ప్రకటించలేదు.

శంకరన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

గొప్ప మానవతావాది ఎస్ఆర్.శంకరన్

ప్రజాశక్తి - కాకినాడ

దేశ చరిత్రలో ఉన్న ఐఎఎస్ అధికారులలో ఉన్నత ఆదర్శ విలువలు కలిగిన గొప్ప మానవతావాది ఎస్ఆర్.శంకరన్ అని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కొనియాడారు. మంగళవారం ఎస్ఆర్.శంకరన్ 90వ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి అధికారులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గుర్తు పెట్టుకునే ఉత్తమ ఐఎఎస్ అధికారులలో ఎస్ఆర్. శంకరన్ ఒకరని అన్నారు. ఆయనను గుర్తు చేసుకుంటూ నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నామంటే ఆయనకున్న ప్రాముఖ్యత, ఆయన చేసిన సేవలే కారణమన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటు పడ్డారన్నారు. ప్రతిఒక్కరు ఆయన జీవిత విధానాన్ని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు మాట్లాడుతూ జీవితాంతం ప్రజలకు నిబద్ధులై ఉండే అరుదైన అధికారుల్లో ఎస్ఆర్ శంకరన్ ప్రథమ స్థానంలో ఉంటారన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి .రామారావు మాట్లాడుతూ ఆయన బతికినంత కాలం దళిత, గిరిజన, ఆదివాసీ అట్టడుగు వర్గాల కోసం కృషి చేశారన్నారు. అంటరానితనం రూపుమాపడానికి ఆయన కృషి ఎంతో ఉందని, పేదవర్గాలకు ఇళ్ల స్థలాలు, భూములు పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని దళిత వేత్త రామేశ్వరావు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పట్టు తప్పితే అంతే సంగతులు..!

ప్రజాశక్తి - సామర్లకోట

ఆర్‌టిసి బస్సులకు ప్రతిరోజూ ఇదే తంటా... కళాశాలల సమయంలో డ్రైవర్‌లు, కండక్టర్‌లు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం 7 గంటలు మొదలు పది గంటలు దాటే వరకూ విద్యార్థులు ఇలా ఫీట్లు కొడుతున్నారు. ఎలాగైనా కళాశాలలకు సమయానికి చేరుకోవాలనే ఆత్రుతతో బస్సులు ఖాళీ లేకున్నా ఇలా ఫుట్ పాత్‌పై వేలాడుతూ ప్రయాణాలను సాగిస్తున్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నిత్యం ఇలాంటి దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. ఒకపక్క ట్రాఫిక్ పోలీసులు ఎంత హెచ్చరిస్తున్నా విద్యార్థులు వినిపించుకోవడం లేదు. సరిగ్గా బస్సులు కదులుతున్న సమయం చూసి ఒక్కసారిగా పదుల సంఖ్యలో విద్యార్థులు ఇలా వేలాడుతూ వెళుతుండటంతో చూసేవారికి గుండె ఆగినంత పని అవుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు ఇలాంటి బస్సులకు దగ్గరగా వస్తే పరిస్థితి ఏమిటని ఊహిస్తేనే గుండె జల్లుమంటుంది. మలుపుల్లో సైతం ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన నెలకుంది. ఇటువంటి ప్రయాణాలను నిలువరించేందుకు విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కళాశాలల రూట్లల్లో బస్ సర్వీసులను అధికం చేస్తే కొంతవరకూ ప్రమాదకర ప్రయాణాలను నిలువరించే అవకాశాలు ఉన్నాయని పలువురు సూచిస్తున్నారు.

వేలాడుతూ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం



జనవాణిలో వినతిపత్రం ఇస్తున్న కొసిరెడ్డి గణేష్

మండలంలోని రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ కోరారు. మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరిలో నిర్వహించిన జనవాణి కార్యక్రమ ఇన్‌ఛార్జ్, ఎంఎల్‌ఎ పంతం నానాజీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రజాసంఘాలు, రాజకీయాలకతీతంగా నవంబర్ 4న రోడ్డు దుస్థితికి నిరసనగా రహదారిపై గోడలు నిర్మిస్తామని నానాజీకి స్పష్టం చేశారు. దీంతో ఆయన కాకినాడ ఆర్ అండ్ బి ఎస్ఇకి ఫోన్ చేసి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలన్నారు. పవన్ కళ్యాణ్ అందుబాటులో లేనందున ఆయన వచ్చిన వెంటనే చర్చించి శాశ్వత పరిష్కారం చేపడతామని హామీ ఇచ్చినట్లు గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు రెడ్డి ఆనంద్‌పాల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ దైవకుమార్

సార్వా పంట నమోదు, ఇకెవైసి ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో సార్వా సాగుకు సంబంధించి పంట నమోదు, ఇకెవైసి ప్రక్రియ పూర్తయిందని ఎడిఎ నల్లి దైవ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తాటిపర్తిలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వా పంట నమోదుకు సంబంధించి తుది జాబితా సచివాలయాల వద్ద, రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. నవంబర్ 10 వ తేదీ నుంచి రైతు సేవ కేంద్రాలలో పంట నమోదు చేయించుకున్న రైతులు ధాన్యం అమ్ముకోవచ్చున్నారు. సాధారణ రకం ధాన్యానికి 75 కేజీలకు రూ.1725, ఏ గ్రేడ్‌కు రూ.1740 చొప్పున ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ మస్తాన్‌బి పాడి పశువుల ద్వారా అధికాదాయం పొందే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ పశువులకు చెవి పోగులు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ప్రసాద్, ఉద్యాన సహాయకులు సిహెచ్.మధు, ఎహెచ్ఎ గోపి, గోపు చంద్రశేఖర్, కొమ్మిరెడ్డి బుజ్జి, కొమ్మిరెడ్డి రమణ, రామచంద్ర రావు, పోకల కృష్ణ పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణ కోసం కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

చిన్న పిల్లల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, అందుకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నిత్యం చిన్నారులు ఏదో ఒకరకంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. చిన్న వయసులో జరిగే లైంగిక వేధింపుల నుంచి పిల్లలను కాపాడుకోవడానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరు శాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లల పట్ల ప్రవర్తించాల్సిన తీరుపై సరైన అవగాహన లేకపోవడం వలన చుట్టుపక్కల ప్రాంతాల్లోని చిన్నారులు తరుచుగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ పిల్లలేనని, 97 శాతం అందరూ తెలిసిన వారి నుంచే పిల్లలు తరచుగా లైంగిక వేధింపుల బారిన పడుతున్నారని అన్నారు. పిల్లలతో కలిసి పని చేసే ప్రభుత్వ, ప్రయివేటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో తల్లిదండ్రులతో పాటు చిన్నారులకు సురక్షితమైన స్పర్శ, చెడు స్పర్శ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులను లైంగిక వేధింపుల భారీ నుంచి కాపాడేందుకు జిల్లాలో విద్య జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, డ్వామా, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. అలాగే జిల్లా హెల్ప్ లైన్ నెంబర్ ఒకటి ఏర్పాటు చేసి పిల్లలపై వేధింపుల విషయంలో వచ్చే సమస్యలు స్వయంగా పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జిల్లా స్థాయి అధికారుల సహాయంతో పరిష్కరించే దిశగా ఆలోచిస్తున్నామని ఆయన వివరించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ సిఇఒ సూర్యప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులలో భౌతికంగా వారి శరీరంలో కలిగే మార్పులు, భావోద్వేగాలు, నిర్లక్ష్యం వంటి కారణాలతో లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. తరచుగా చిన్నారులు లైంగిక వేధింపులకు గురికావడాని గల కారణాలు, చిన్నారులకు రక్షణ కల్పిస్తూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన వివిధ చట్టాలకు సంబంధించి ఎన్‌సిపిఆర్, పోక్సో చట్టాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల పరిష్కార మార్గంలో భాగంగా మండల స్థాయిలో బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు వేసి, తద్వారా ట్రెయిన్సర్స్‌ని తయారు చేసి ప్రతీ స్కూల్, హాస్టల్, గ్రామాల్లో అవగాహనా తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. జిల్లాలో చిన్నారుల భద్రత రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూరు శాతం చిన్న పిల్లల సురక్షితమైన జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన, అడిషనల్ ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జ్ పీడీ కె.శ్రీరమణి, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిఇఒ పి.రమేశ్, సిపిఒ పి.త్రినాథ్, డిపిఒ వి.రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

డి.పట్టా భూముల జోలికొస్తే సహించం

ప్రజాశక్తి - కోటనందూరు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సమితి నాయకులు

ఎస్‌సిలు సాగు చేసుకునే డి పట్టా భూముల జోలికి వస్తే సహించేది లేదని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆరుగుల మోషే అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ ఎస్‌సిల భూములను కొందరు లాక్కొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు గంపల బాబురావు, తుమ్మలపల్లి కుమార్, మోటుకూరి ఏసుబాబు పాల్గొన్నారు.

ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమావేశంలో మాట్లాడుతున్న బంగర్రాజు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించే ప్రజా హక్కుల ర్యాలీ జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కార్యవర్గ సభ్యులు బుగతా బంగార్రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని పక్కన పెట్టిందని అన్నారు. రాష్ట్రంలో మైనర్ బాలికలపై అఘాయిత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను పరిశీలించిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొమరగిరి పంచాయితీ శివారు ఆనందనగర్‌లో డ్రెయినేజీలను మంగళవారం డి ఎల్‌పిఒ అన్నామణి పరిశీలించారు. గ్రామంలో శాశ్వతమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో తాత్కాలికంగా డ్రెయినేజీ తీశారని, అయితే నిత్యం ఈ డ్రెయినేజీ పూడికతో నిండిపోతుందని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కూరుకుపోయిన చెత్తను పంచాయితీ కార్మికులతో తొలగించారు. ప్రస్తుతానికి డ్రెయినేజీ నీరు రోడ్డు మీదుకు రాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామని, డ్రెయినేజీ నిర్మాణానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ పర్యటనలో ఇఒపిఆర్‌డి సత్యరెడ్డి, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక డ్రెయినేజీలో పూడికను తీయిస్తున్న డిఎల్‌పిఒ

రామకృష్ణకు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఛీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందిస్తూ పదవీ విరమణ పొందని ని హెచ్.రామకృష్ణకు మంగళవారం ఘనంగా వీడ్కోలు సత్కార సభను నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కర సభలో పలువురు రామకృష్ణ సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గతి తప్పుతున్న రుతుపవనాలు

కూటమిలో రైతులకు న్యాయం

ప్రజాశక్తి - గండేపల్లి

రైతులు నిరుత్సాహం పడవద్దని, కూటమి ప్రభుత్వంలో వారికి తగిన న్యాయం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మురారి సచివాలయ ఆవరణలో ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నిరుత్సాహం పడవద్దని, రైతులు అమ్మిన ధాన్యం బకాయిలు అతి కొద్ది రోజులలోనే వారి వారి అకౌంట్లోకి జమ చేసేందుకు ప్రభు త్వం నిర్ణయం తీసుకుందన్నారు. పంట పొలాల్లో ధాన్యం ను నూర్చిన వెంటనే రైతు సేవా కేంద్రానికి సమాచారం ఇస్తే అవసరమైన సంచులు ఇవ్వడం జరుగుతుంద న్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ రైతు పడే కష్టం చాలా పెద్దదని, ఆ కష్టానికి తగ్గట్టే రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. ఉప సర్పంచ్ జాస్తి వసంత్ మాట్లాడుతూ రాష్ట్ర సివిల్ సప్లయి ఛైర్మన్‌ను మనం పేపరు, టీవీల్లో మాత్రమే చూసేవారమని, అయితే ప్రస్తుత ఛైర్మన్ గ్రామసభల్లో కన్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల ఆనందబాబు, ఎపి పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లు తుమ్మల పద్మజాలక్ష్మి, కడలి ఈశ్వరి, బోడపాటి శివదత్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు నున్న రామకృష్ణ, ఎంపిపి చలగళ్ల దొరబాబు, జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, కార్యదర్శి పోతుల శిరీష, కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధీర్‌కుమార్

విద్యార్థులతో ప్రాంతీయ సమన్వయకర్త పావని

దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని ఉన్నత్ భారత్ అభియాన్ ఆంధ్ర విశ్వకలా పరిషత్ ప్రాంతీయ సమన్వయకర్త పావని భీశెట్టి అన్నారు. మంగళవారం పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఉన్నత కళాశాలలు, వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి. వాలంటీర్లతో కలిసి వారి కళాశాలలకు అనుబంధంగా ఉన్న గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూర్యప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, డీన్ డాక్టర్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి, రీసెర్చ్ హెడ్ డాక్టర్ వంశీ, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సుమ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదిత్యలో వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నిర్వాహకులు

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో మంగళవారం 'టోటల్ స్టేషన్ వినియోగం ఇన్ సర్వేయింగ్' అనే అంశంపై 5 రోజుల వర్క్‌షాప్ ప్రారంభం అయింది. ఈ సదస్సులో ట్రైనర్‌గా ఎస్‌డివివిఎల్ కన్స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఎండి పవన్ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోటల్ స్టేషన్ యొక్క ప్రాముఖ్యతను, దానివలన కలిగే ఉద్యోగ అవకాశాలపై పవన్ సాయి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ టోటల్ స్టేషన్‌ను నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో సర్వేయింగ్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.నాగసాయి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పులుసుకూర సునీత మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలు భర్త తెలిపిన వివరాల మేరకు.. గత మూడు నెలలుగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బందారు మురళి, గంట నానిబాబు, గుబ్బల భవాని తన భార్య సునీతను ఫీల్డ్ అసిస్టెంట్‌గా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రతినెల తమకు డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురియైన తన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనసేన నాయకులు బందారు మురళి, ఘంటా నానిబాబు ఈ ఆరోపణలను ఖండించారు. ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలకు పాల్పడుతున్నారని ఉపాధి కూలీలు ఈ నెల 5వ తేదీన ద్వామా పీడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. రెండు రోజుల్లో అధికారులు విచారణ చేపట్టబోతుండ రానున్నారని వారు తెలిపారు. ఈ మేరకు కరప పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన అడవి పంది -వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డు సూరంపాలెం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి అడవి పంది బైకును ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన చాలా కామరాజు తన ఎలక్ట్రిక్ బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వస్తుండగా మార్గమధ్యలో కాకినాడ సమీపంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రంపం నాగేశ్వరరావు బైకు ఎక్కాడు. ఇద్దరూ బైక్ పై వస్తుండగా సూరంపాలెం సెంటర్ వద్ద అడవి పంది ఈ బైకును ఢీకొట్టింది, బైక్‌పై ఉన్న ఇద్దరూ క్రింద పడిపోగా వెనుక కూర్చున్న నాగేశ్వరరావు అక్కడ అక్కడే మృతి చెందాడు, బైక్ నడుపుతున్న కామరాజు తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మురమళ్ళ నుంచి కుండలేశ్వరం ఏటుగట్టు పై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఒక వ్యక్తి మరణించాడు. కాకినాడకు చెందిన కర్రి ప్రసాదరావు (60) కాకినాడ నుండి కుండలేశ్వరానికి సమీపంలో ఉన్న చెరువుల వద్దకు ప్రతిరోజు వస్తుంటారు. దీనిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున మోటార్ సైకిల్ పై కాకినాడ నుంచి చెరువుల దగ్గరికి వస్తుండగా ప్రమాదవశాత్తు వియర్ (వైర్) వద్ద నీటిలో పడిపోయారు. ఈయన నుండి సమాచారం లేకపోవడంతో బంధువులు వెతకడం ప్రారంభించారు. కొండలేశ్వరం వద్ద మంగళవారం మతదేహం లభించడంతో సంఘటన ఏ విధంగా జరిగింది అన్న తీరుపై ఆరా తీస్తున్నారు. ప్రసాద్ రావు కనిపించడం లేదంటూ కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని కాకినాడ తరలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - అలమూరు

బంగారు వస్తువుల చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని ఈ నెల 17న జొన్నాడకు చెందిన ఓబిలిశెట్టి సోమరాజుకు చెందిన తాళం వేసిన ఇంటిలోని బీరువా నందు ఉంచిన 40 కాసుల బంగారు వస్తువులు గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు దర్యాప్తులో మంగళవారం ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏలేశ్వరం లోని ప్రస్తుత శరీల్ రోడ్ జి.భీమవరం వస్టెన్ పరిధి, బ్రాహ్మణ వీధికి చెందిన పండిరి వెంకటనారాయణ అలియాస్ నారిగాడు, బుజ్జి(32), నెల్లూరులోని షాదీ మండల్ దగ్గర కోమటిపల్లెకు చెందిన షేక్‌అహ్మద్ బాషా(42) తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వారి కదలికలను పసిగట్టిన తమ సిబ్బంది ఇద్దరు నిందితులను జొన్నాడ సెంటర్ వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం వస్తువులను రికవరీ చేసి, అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులకు సంబంధించి 312 గ్రాముల బంగారు వస్తువులు, రెండు రోల్డ్ గోల్డ్ గాజులు కాగా వారి వద్ద 121 గ్రాముల బంగారం వస్తువులు, రెండు రోల్డ్ గోల్డ్ గాజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన అధికారులను కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు అభినందించారు. ఈ సందర్భంగా సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్, హెచ్‌సి సుబ్రహ్మణ్య స్వామి, పోలీసులు భైనన్, గంగాధర్, రాంబాబు, నెహ్రూ, శ్రీనివాసరావు, రవికుమార్, చిట్టిబాబు ఉన్నారు.

విద్యార్థిని మృతిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - అలమూరు

ఓ విద్యార్థిని మరణంపై ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన విలకలపూడి సత్యనారాయణ రెండవ కుమార్తె చెక్కపల్లి వెన్నెల చెముడులంక శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్(ఐఎం) స్కూల్ పదవ తరగతి చదువుతోంది. అయితే స్కూల్ దసరా సెలవులు ఇవ్వటం లేదని, ఈనెల 6న వెన్నెల జిల్లా కలెక్టర్‌కు నా సెల్ నుండి సమాచారం అందజేసింది. జిల్లా కలెక్టర్ సమాచారం అందుకున్నందుకు స్కూల్ డైరెక్టర్ ఉమారాణి నా కుమార్తె వెన్నెలని టార్చర్ చెయ్యడం వల్ల మనస్తాపానికి గురై ఆది వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, అంతకంటే మరో కారణంగా విద్యార్థి వెన్నెలను 10వ తరగతి పాస్ కాకుండా చేస్తానని యాజమాన్యం భయపెట్టడం వల్లే నా కూతురు మనస్తాపానికి చనిపోయిందన్నారు. ఇక మీదట భవిష్యత్తులో ఏ విద్యార్థినికి ఇలాంటి పరిస్థితి రాకూడదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై తక్షణమే స్పందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశం లో మాట్లాడుతున్న పూర్వపు పిడిఎఫ్ ఎం ఎల్ సి విరవు బాలసుబ్రమణ్యం

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని పిడిఎఫ్ పూర్వపు ఎంఎల్‌సి విరవు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కచేరి పేటలో యుటిఎఫ్ హాల్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యుటిఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ హక్కులు-బాధ్యతలు రెండు నేత్రాలుగా పనిచేసే సంఘమని అన్నారు. సమాజ భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల మీద ఆధారపడి ఉందన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో అగ్రభాగాన ఉంటారని అన్నారు. ఒక సామాజిక చైతన్య కేంద్రంగా పని చేస్తున్న యుటిఎఫ్ కార్యాలయం ప్రక్కన ఏర్పాటు చేసిన బ్రాందీ షాప్‌ను తొలగించాలని ఆయన కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణ స్పందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపి చకచకేతే భవిష్యత్తులో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకె వెంకటేశ్వరరావు, ఎంటివి. సుబ్బారావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, ఇవిఎస్-ఎస్ఆర్.ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవివి.నగేష్, తోటకూర చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శులు అన్నారాము, ఎస్.జ్యోతిబసు, ఎన్.అరుణకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు చొల్లంగి విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మండలంలోని చొల్లంగి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీలిమ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాకినాడ డిఎస్ఏ క్రీడా ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన అండర్-19 బాలికల టెన్నిస్ పోటీలలో విద్యార్థినులు పి.పుష్పలత, కె.వీరశ్రావణి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 28న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి - సామర్లకోట

పైపులైన్ నుంచి లీకౌతున్న నీరు

పట్టణ శివారు జి.రాగంపేట రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో మంచినీటి బోరు వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లైనుకు లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. దీంతో బోరు చుట్టూ పెద్దఎత్తున నీరు నిలిచిపోయి బురద మయంగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు. అలాగే వాటర్ ట్యాంకును ఆనుకుని బోరు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ప్యానల్ బోర్డు ప్రమాదకరంగా మారింది. వర్షాల నేపథ్యంలో బోరు వాటర్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకులను అరికట్టడంతోపాటు, విద్యుత్ బోర్డుకు షార్ట్ సర్క్యూట్ కాకుండా భద్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు గత రీ సర్వేలో జరిగిన అవకతవకలు, లోపాలను సరిదిద్దాలని అధికారులను కోరారు. రీ సర్వేలో జరిగిన లోపాలను సరి చేసే రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు మండలంలోని తర్లంపూడిలో జరిగిన గ్రామ సభలో తహశీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొని మాట్లాడారు. గతంలో నిర్వహించిన భూముల సర్వేను డ్రోన్ సాయంతో నిర్వహించారని, అయితే పాస్ బుక్‌లో పేర్లు తప్పులు పడడం, సర్వే నెంబర్లు, ఆధార్ నెంబరు తదితర అంశాలు మార్పు చేర్పులు చేసేందుకు గ్రామ సభలు దోహదపడతాయన్నారు. ఈ సభలో సర్పంచ్ నరాల బాలరాజు, ఎంపిటిసి సభ్యులు గొల్లపల్లి సింహాద్రిరావు, ఆర్ఐ విష్ణువు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సర్వేయర్ నవీన్ భూ యజమానులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని చేబ్రోలులో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని రీ సర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సౌజన్య, ఆర్ఐ, విఆర్ఓలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని ఉండూరు గ్రామంలో గ్రామ సభ తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 27 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీ సర్వేలో జరిగిన లోపాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సభలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సిహెచ్.నరసింహమూర్తి, ఎ.సంజీవ్‌భరత్, టి.సాయిరాం, విఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని సిరివాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మి పాల్గొని భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో ఉపసర్పంచ్ ఇనుకొండ వీరవిష్ణుచక్రం, భీమలింగం బాబులు, తాటికొండ సోమరాజు, విఆర్ఓ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ పాల్గొన్నారు. **తొండంగి** మండలంలోని పైడికొండ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో భూ సంబందిత సమస్యలపై ప్రజల నుంచి 151 వినతులు వచ్చాయి. తహశీల్దార్ ముఖర్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లప్రోలులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కాజులూరులో మాట్లాడుతున్న తహశీల్దార్

ఆదిత్య యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయ -2024కి కబడ్డీ జట్టు ఎంపికైందని డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సెలర్ డాక్టర్ ఎస్.రమశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ త్రిపాఠి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ అధిపతి డాక్టర్ ఎస్.రవి పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానికంగా ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యం లోఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వీరబాబు, దొడ్డ శ్రీను, సురపురెడ్డి నరేష్, మొగిలి గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకటశ్రీనివాసరావు పుట్టిన రోజు

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మంగళవారం మండలం దివిలి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

కుట్టు మిషన్‌ను అందిస్తున్న నిర్వాహకులు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద కుటుంబాలకు రెండు కుట్టు మిషన్లను వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోకవరపు సుభాష్ మంగళ వారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేబినెట్ సెక్రటరీ పేకేటి సతీష్, కేబినెట్ ట్రెజరర్ వరదా శేషయ్య, క్లబ్ ప్రెసిడెంట్ అద్దేపల్లి సుధ, సామా ప్రకాష్, అద్దేపల్లి సత్తిరాజు, గోకవరపు శ్రీదేవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద రహితంగా దీపావళి జరుపుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ప్రమాదరహితంగా, ఆనందంగా జరుపుకోవాలని అగ్నిమాపక జిల్లా సహాయాధికారి శ్రీహరి జగన్నాథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా వెలిగించే ముందుగుండు సామాగ్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు బాణాసంచా కాల్చడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుడిసెలు, తాటాకు ఇల్లు, అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి ఇబ్బంది కలగని రీతిలో దీపావళి పండుగ ఆనందంగా జరుపుకోవాలన్నారు.

ఈనెల 25న పిఠాపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పిఠాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పిఠాపురంలో ఈ నెల 25న మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయని వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి డిగ్రీ, డిప్లొమో పూర్తి చేసి 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన నిరుద్యోగులు తమ విద్యార్హత సర్టిఫికెట్లకు సంబంధించిన జిరాక్స్ కాపీలతో 25వ తేదీ ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో నేటి నుంచి నవంబర్ 8వ తేదీ వరకూ భూముల రీ సర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.త్రినాధరావు తెలిపారు. నేడు చొల్లంగిలో ఉదయం 10 గంటలకు గ్రామ సభ ప్రారంభం అవుతుందన్నారు. భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తామని, ప్రజలు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా ఈ ప్రకటన పూర్వకంగా యావన్మంది ప్రజలకు తెలియచేయునది ఏమనగా,

నా క్లయింటు, పిఠాపురం పట్టణ కాపురస్తులు, సాయిబాబా గుడి వీధి డో.నెం. 4-2-8 కోట శ్రీనివాస్ గారి భార్య నూకరత్నం, కుమారుడు శ్రీరామచంద్రమూర్తి, వారి తాలూకు రిజిస్టర్డ్ శెటిల్‌మెంటు దస్తావేజు నెం. 12270/2022 ఒరిజినల్స్ జిరాక్స్ నిమిత్తం కోటగుమ్మం సెంటర్‌కు వెళుచుండగా పడిపోయినవి. మా క్లయింట్లు వెంటనే ఎంత వెతికినను దొరకలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనను దొరికినచో వెంటనే నా క్లయింటు పై అడ్రస్ నందు గాని లేదా ఈ క్రింది లాయరు గారి అడ్రస్ నందు గాని అప్పగించవలెను. సదరు దస్తావేజు రీత్యా ఎవరైనను ఎటువంటి లావాదేవీలు జరిపినచో అవి ఏమియు నా క్లయింట్సును బైండు చేయవనిని మరియు నా క్లయింట్సు తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు వారే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది.

బి.ఎ.కె.ఈశ్వర్‌బాబు, అడ్వకేట్
డో.నెం. 2-3-67, కొత్తపేట
పిఠాపురం పిఠాపురం-533450
22-10-2024 సెల్: 9491010818

17 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ ఎస్పి ఎమ్.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం భట్నవిల్లి గ్రామంలో 2 చోట్ల నిర్వహించిన తనిఖీలో అక్రమంగా నిల్వ ఉంచిన 17 డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను స్వాధీన పరుచుకున్నారు. అక్రమ సిలిండర్ల నిల్వ ఉంచినట్లు అధికారులకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన ఈ తనిఖీలో బలభద్ర మల్లిఖార్జున రావు తండ్రి మాణిక్యం ఇంటి నందు 9 డొమెస్టిక్ (గృహ) సిలిండర్లును, భలభద్ర పాపారావు కిరణ మరియు కూల్ డ్రింక్స్ నందు 8 డొమెస్టిక్ (గృహ) సిలిండర్లు సిఎస్‌డిటి అమలాపురం వారు స్వాధీన పర్చుకున్నారు. సంబంధిత షాపుల యాజమానుల పై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి నాగవెంకటరాజు, నవీన్ కుమార్,వలీ, లోవరాజు, సి.ఎస్.డి.టి భారతి పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - గోపాలపురం, ఉండ్రాజవరం

మండలంలోని చిట్యాలలో ముత్యాలమ్మ గుడివద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు కొండేపాటి రత్నాజీ, గద్దె వీరకృష్ణ మాట్లాడారు. నవరాత్రులు పురస్కరించుకొని భవానీలు, స్వాములు, గ్రామస్తుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు. సుమారు 2వేల మంది అన్నదానంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి చీరలకు వేలం నిర్వహించి పాటదారులకు అందించారు. ఉండ్రాజవరం మండలం చివటం పద్దాల వెంకమ్మ ఆలయం దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం శ్రీ లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మొబైల్ ఆధార్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

మొబైల్ ఆధార్ కేంద్రంలో ప్రజలు

మండలంలో మొబైల్ ఆధార్ సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 12 నుంచి 25వ తేదీ వరకూ జరిగే మొబైల్ ఆధార్ క్యాంప్ పనసపాడు, అచ్చంపేట గ్రామ సచివాలయాల్లో ప్రారంభించారు. విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు నూతన అధార్ కార్డ్‌లు రిజిస్టర్, పెద్దలకు ఆధార్ అప్‌గ్రేడేషన్, మొబైల్ లింకింగ్, అడ్రెస్స్ మార్పులు, చేర్పులకు ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.హిమమహేశ్వరీ చెప్పారు. పిబి దేవం గ్రామంలోనూ ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయాల్సివుందని, అయితే ఆధార్ కిట్‌లు అందుబాటులో లేకపోవడంతో క్యాంప్‌ను రద్దు చేసినట్లు తెలిపారు.

CHANGE OF SUR NAME

I, URRINKALA SURESH (NEW SURNAME), S/o Abbulu" Previously called "VARINKALA SURESH (OLD SURNAME)" Dr.No.2-89, Gouda Ramalayam Street, Sankarapuram Village, Nidadavole Mandalam, W.G. Dist.,-534301 (Now E.G.District), AP., Have changed my name "VURINKALA SURESH (OLD SURNAME) to "URRINKALA SURESH" Hence ofter all my Documents and Correspondence will be continue With my new surname URRINKALA SURESH.

రాజశేఖర్‌ను గెలిపించుకుంటాం

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రత్తిపాడు ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించుకుంటామని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు, ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి, కూటమి నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, చిలుకూరి రామకుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక కొప్పుల వెలమ కళ్యాణ మండపంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, ఎంఎల్‌సి వి.చిరంజీవి, ఎంఎల్ఎ నిమ్మకాయన చిన్నరాజప్ప, ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టిడిపి పరిశీలకులు బొడ్డు వెంకటరమణ, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక టిడిపి కార్యాలయంలో పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యమ్రంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు తుమ్మలపల్లి రమేష్, దాట్ల కృష్ణవర్మ, ఎస్‌విఎస్. అప్పలరాజు, మారిశెట్టి భద్రంపాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల నిరసన

కూటమి పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పెద్దాపురంలో నిర్వహించిన సమావేశంలో జనసేన పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కూటమి ఎంఎల్‌సికి మద్దతు తెలియచేస్తూ ప్రచురించిన కర పత్రంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామ స్వామి ఫోటో లేకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు ఒక్క సారిగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా సమావేశం హాలు వేడెక్కింది. అయితే తుమ్మల బాబు కార్యకర్తలకు సర్ది చెప్పడంతో వారు శాంతించారు.

ORder 21, Rule 66 నోటీసు
మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, ముమ్మిడివరం
E.P. 6/2022 in O.S. 12/2021

Between:
గోకవరపు శ్రీ రామ సత్య భాస్కరరావు -పిటీషనరు/ DHr
మరియు
చవ్వాకుల వెంకట కృష్ణ -రెస్పాండెంటు/ JDr

To:
చవ్వాకుల వెంకటకృష్ణ, S/o. పట్టాభిరామయ్య, మురమళ్ళ, ఐ.పోలవరం మండలం.

పై నంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు సేల్ నోటీసులు జారీ చేసినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది. **28-10-2024వ తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కొండేపూడి లక్ష్మీ వరప్రసాదరావు
అడ్వకేటు, డో.నెం.14-309/3
ముమ్మిడివరం సబ్ ఎలక్ట్రికల్ బోర్డు ఎదురుగా
22-10-24 ముమ్మిడివరం, సెల్: 9948302179

యానాం వార్తలు


భవనంలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న న్యాయశాఖ కార్యదర్శి

తాత్కాలిక కోర్టు భవనం పరిశీలన

ప్రజాశక్తి - యానాం

యానాం పర్యటనకు విచ్చేసిన న్యాయశాఖ కార్యదర్శి డాక్టర్ ఎల్ఎస్.సత్యమూర్తి మంగళవారం ప్రస్తుత కోర్టు భవనాన్ని పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి గుడి పక్కన ఉన్న మున్సిపల్ కళ్యాణమండపంలో ఏర్పాటు కాబోతున్న తాత్కాలిక కోర్టు భవనం మరమ్మతు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యానం కోర్టు సబ్ జడ్జి కె.రాజామోహన్, పరిపాలనాధికారి మునిస్వామి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గాశ్రీనివాస్, న్యాయవాదులు మాజేటి నటరాజన్, కమిడి విజయ్‌కుమార్, నడుంపల్లి సత్యనారాయణరాజు, నామాడి స్వరాజ్యలక్ష్మి, పడాల సుబ్బారావు, గడ్డం భ్రమరాంబ, గడ్డం ఈశ్వరరావు, ఇంధన రామకృష్ణ, పేర్ని ఆదినారాయణమూర్తి, టేకు గంగాభవాని, నారాయణ పాల్గొన్నారు.

ఆటస్థలంలో వాటర్ ట్యాంకు వద్దు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వాకలపూడి గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌సి పేటలో ఉన్న ఆట స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేయడం తగదని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్‌సి పేటలో ఉన్న ఖాళీ స్థలంలో స్థానిక యువకులతోపాటు, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు ఆడుకుంటున్నారని, అయితే ఆ స్థలంలో వాటర్ ట్యాంకును నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. అయితే స్థానిక ప్రజలు దీనిని వ్యతిరేకించడంతో అప్పట్లో వాటర్ ట్యాంకు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి వాటర్ ట్యాంకు నిర్మించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. వాకలపూడిలో అనేక మిగులు భూములు ఉన్నాయని, ఆ భూముల్లో కాకుండా విద్యార్థులు, యువకులకు ఆట స్థలంగా వినియోగించుకుంటున్న స్థలంలోనే వాటర్ ట్యాంకు నిర్మించాలని చూడటం సరికాదన్నారు. ఈ కుట్ర అంతా ఇఒ పాండురంగారావు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటానికైనా సిద్ధమని, తక్షణమే ఇటువంటి చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వేలివెన్నులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్నులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తుడు కె.దుర్గాప్రసాద్ కోరుతున్నారు. మంగళవారం సత్యవాడ గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపునకు తన కుమారుని ఆధార్ కార్డులో మార్పులు నిమిత్తం పాఠశాలకు సెలవు పెట్టి తీసుకెళ్లానని తెలిపారు. గతంలో వేలువెన్నులో ఆధార్ కేంద్రం ఉండేదని అది గ్రామస్తులకు సౌకర్యంగా ఉండేదన్నారు. మార్పులు చేర్పుల కోసం ఇప్పుడు సత్యవాడ వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా చిలకపాడు పంచాయతీ కార్యదర్శి సిహెచ్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వచ్చారన్నారు. 60 మంది ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ ఎన్ నాని, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, ఏఎన్ఎం మల్లీశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్ కుమారి పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో
I.A. No. 17/2024 in O.S. No. 40/2018

Between:
Moka Venkateswara Rao and another -పిటీషనర్లు/ వాదులు
AND
Pulapakura Chittiyya (died) and others -రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

To:
R-5: Mudiduddi Bujji, W/o. Dorababu, Cheyyeru Village, Katrenikona Mandal, MMD, Jr.C.J.

R-6: Pulapakura Durga, D/o. Chittiyya, I.Polavaram Village, I.Polavaram Mandal, MMD, Jr.C.J.

ఈ పై నెంబర్ దావాలో మిమ్మల్ని ప్రతివాది యొక్క వారసులుగా జాయిన్ చేయమని పై కోర్టులో పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసులు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **25-10-2024వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥ ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్: 9440041751
ది.23-10-2024 9440528135